# పారదర్శకంగా మొదటి విడుత ర్యాండమైజేషన్

● కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

సూర్యాపేట, అక్టోబర్ 20 : సార్వత్రిక ఎన్నికల కోసం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మొదటి విడుత ఈవీఎం యంత్రాల ర్యాండమైజేషన్ పారదర్శకంగా నిర్వహించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ తెలిపారు. శుక్రవారం పాత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నాలుగు నియోజక వర్గాల పోలింగ్ ఈవీఎం యంత్రాల ర్యాండమైజేషన్‌ను ఎస్పీ రాహుల్ హెగ్డేతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీఎం యంత్రాల ర్యాండమైజేషన్ చేసినట్లు చెప్పారు. జిల్లాలోని నాలుగు నియోజక వర్గాల పరిధిలో 1,201 పోలింగ్ కేంద్రాలు ఉండగా 4,684 యూనిట్లు కేటాయించడం జరిగిందన్నారు. బ్యాలెట్ యూనిట్లు 1,502, కంట్రోల్ యూనిట్లు 1,502, వీవీ ప్యాట్స్ 1,680 ర్యాండమైజేషన్ ద్వారా నియోజక వర్గాలకు కేటాయించడం జరిగిందన్నారు. హుజూర్‌నగర్ 1,201, కోదాడ 1,154, సూర్యాపేట 1,057, తుంగతుర్తి 1,272 కేటాయించినట్లు తెలిపారు. మొదటి ర్యాండమైజేషన్‌కు సంబంధించిన హార్డ్, సాఫ్ట్ కాపీలు రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించినట్లు వివరించారు. వాటిని నియోజక వర్గాల స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించే ప్రక్రియలో పార్టీల ప్రతినిధులు పరిశీలన చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సీహెచ్ ప్రియాంక, వెంకట్‌రెడ్డి, ఆర్డీఓలు బ్రహ్మచారి, జగదీశ్‌రెడ్డి, సూర్యనారాయణ, రాజేశ్వర్‌రావు, సత్యనారాయణ, గోపి పాల్గొన్నారు.



మొదటి విడుత ర్యాండమైజేషన్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

### బ్యాంకింగ్ లావాదేవీలపై ప్రత్యేక నిఘా..

బ్యాంకింగ్ లావాదేవీలపై ప్రత్యేక నిఘా ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నగదు లావాదేవీల నిఘా కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఎన్నికల్లో నగదు ప్రభావాన్ని అడ్డుకునేందుకు ఈ సెల్ ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం బాపూజీ, ఏఓ సుదర్శన్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సైబర్ సెక్యూరిటీ సెల్ పరిశీలన



సైబర్ సెక్యూరిటీ సెల్‌ను పరిశీలిస్తున్న రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో అడ్మిన్ ఎస్పీ

సూర్యాపేటసిటీ, అక్టోబర్ 20 : రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో అడ్మిన్ ఎస్పీ విశ్వజిత్ కంపాటి జిల్లా పోలీస్ కార్యాలయంలోని సైబర్ సెక్యూరిటీ సెల్‌ను శుక్రవారం పరిశీలించారు. సిబ్బంది బలోపేతం చేయడంతో పాటు సామగ్రిని అందిస్తామని అడ్మిన్ ఎస్పీ అన్నారు. అనంతరం జిల్లా సైబర్ సెక్యూరిటీ సెల్ వివరాలను ఎస్పీ రాహుల్ హెగ్డే వివరించారు.ఆయన వెంట అదనపు ఎస్పీ నాగేశ్వర్ రావు, సైబర్ సెల్ డీఎస్పీ శ్రీనివాస్ ఉన్నారు.

### పోలీస్ సంస్మరణ కార్యక్రమం..

అక్టోబర్ 21న పోలీస్ సంస్మరణ దినోత్సవం సందర్భంగా పోలీస్ అమరులకు నివాళి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఎస్పీ రాహుల్ హెగ్డే తెలిపారు. పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా శనివారం జిల్లా పాత పోలీస్ కార్యాలయం ఇందిరమ్మ కాలనీ పరేడ్ గ్రౌండ్‌లో స్మృతి పరేడ్ జరుగుతుందన్నారు.

## బతుకమ్మ సంబురాలు



సూర్యాపేటలో బతుకమ్మ ఆడుతున్న న్యాయమూర్తులు

సూర్యాపేటలీగల్, అక్టోబర్ 20 : సూర్యాపేట కోర్టుల ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్ మాట్లాడుతూ.. తెలంగాణ మహిళలకు ఎంతో ప్రీతికరం బతుకమ్మ పండుగ అన్నారు. తీరొక పూలతో బతుకమ్మను అలంకరించి వారి సౌభాగ్యాలను కాపాడాలని కోరుతూ ఆడేదే ఈ పండుగన్నారు. వేడుకల్లో సూర్యాపేట సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీదేవి, జూనియర్ సివిల్ జడ్జి జె.ప్రశాంతి, సూర్యాపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.అశోక్, పిపి కె.లింగయ్య, కాకి రామ్‌రెడ్డి, సవీందర్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# విధులకు రాకుండానే జీతం డబ్బులు డ్రా ?

- 11 నెలలు ఇదే తంతు
- పెన్‌పహాడ్ పీహెచ్‌సీలో ల్యాబ్ టెక్నీషియన్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు
- విచారణ కమిటీ ఏర్పాటు



పీహెచ్‌సీలో విచారణ చేస్తున్న విచారణ అధికారి సాహితి

పెన్‌పహాడ్, అక్టోబర్ 20 : విధులకు హాజరు కాకుండానే ఓ వ్యక్తి జీతం డబ్బులు (దాదాపు రూ.10 లక్షలు) డ్రా చేశాడు. ఇలా ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 11 నెలలు. మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2గా విధులు నిర్వహించిన సత్యనారాయణపై ఈ ఆరోపణలు వెల్లువెత్తాయి. హైదరాబాద్‌లో పనిచేసే సత్యనారాయణ 317 జీఓ ప్రకారం పెన్‌పహాడ్ పీహెచ్‌సీకి బదిలీపై వచ్చాడు. హైదరాబాద్‌లో ఉండే ఇతను నెలలు నెలలుగా విధులకు డుమ్మాలు కొడుతూ ఎప్పుడో ఓసారి విధులకు హాజరౌతూ అధికారులు, యూనియన్ నాయకులను మచ్చిక చేసుకుని డుమ్మాలు కొట్టిన రోజుల్లోనూ సంతకాలు పెట్టేవాడనట్లుగా సమాచారం. వైద్యాధికారి ప్రవంతికి డ్రాయింగ్ పవర్స్ రావడంతో హాజరు రిజిస్టర్‌లో ఆబ్‌సెంట్లు, మెడికల్ లీవ్‌గా నమోదు చేశారు. సత్యనారాయణ వ్యవహారంపై సూర్యాపేటకు చెందిన సామాజిక కార్యకర్త ఆ శాఖ జిల్లా, రాష్ట్ర ఉన్నతాధికారులకు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. విషయం బహిర్గతం కావడంతో ఇన్నాళ్లు సహకరించిన జిల్లా అధికారి సూచనల మేరకు సత్యనారాయణ ఫారెన్ సర్వీస్ పేరుతో తిరిగి హైదరాబాద్‌కు డిప్యూటేషన్‌పై వెళ్లాడు.

### విచారణకు వచ్చి..

కలెక్టర్, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ అధికారుల ఆదేశాల మేరకు డీఎంహెచ్ డాక్టర్ సాహితీ, డీఐఓ వెంకటరమణ విచారణ అధికారులుగా నియమితులయ్యారు. శుక్రవారం విచారణ చేసేందుకు డాక్టర్ సాహితీ పీహెచ్‌సీకి చేరుకున్నారు. రికార్డుల కోసం వేచి చూస్తున్న సమయంలో ఫోన్ రావడంతో విచారణ వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగికి నోటీస్ ఇవ్వకుండా విచారణ ఎలా చేస్తారన్న ఉన్నతాధికారుల ఆదేశంతో విచారణ వాయిదా పడ్డట్లు, తిరిగి ఈ 31న విచారణ ఉంటుందన్నారు.



సఫావత్‌తండాలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు

## పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

● ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు

సూర్యాపేట రూరల్, అక్టోబర్ 20 : జరుగబోయే అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని ఎంపీడీఓ శ్రీనివాస్ రావు అధికారులకు సూచించారు. శుక్రవారం మండలంలోని పిన్నాయిపాలెం, సఫావత్‌తండాల్లో అధికారులతో కలిసి పోలింగ్ కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో అధికారులు ఏఈ భరత్‌కుమార్, కిరణ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చివ్వెంల, అక్టోబర్ 20 : బైక్‌ను వెనుక నుంచి కారు ఢీకొట్టిన ఘటనలో వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన మండలంలోని రోళ్లబండ తండా స్టేజీ వద్ద హైదరాబాద్ ఖమ్మం రహదారిపై గురువారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ విష్ణు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వట్టిఖమ్మం పహాడ్ గ్రామానికి చెందిన వీరబోయిన సైదులు(35). ఎలక్ట్రీషియన్‌గా సూర్యాపేటలోని షాపులో పని చేస్తున్నాడు. పని ముగించుకుని రాత్రి సమయంలో బైక్‌పై స్వగ్రామం బయల్దేరాడు. రోళ్లబండాతండా వద్దకు రాగానే ఖమ్మం వైపు వెళ్తున్న కారు అదుపుతప్పి బైక్‌ను ఢీకొట్టడంతో సైదులు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. సైదులు భార్య సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. సైదులు కుటుంబ సభ్యులను మంత్రి జగదీశ్‌రెడ్డి పరామర్శించారు.

## సదరం క్యాంప్ రద్దు

సూర్యాపేట, అక్టోబర్ 20 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ 26న స్లాట్ బుకింగ్, 31న నిర్వహించే సదరం క్యాంప్‌లను రద్దు చేయడం జరిగిందని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సుందరి కిరణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల తర్వాత తేదీలను ప్రకటించనున్నట్లు వెల్లడించారు.



జానారెడ్డి మాట్లాడుతున్న సమయంలో ఖాళీగా కనిపించిన కుర్చీలు

# కాంగ్రెస్ సభ వెలవెల

- తిరుమలగిరి సాగర్‌లో కాంగ్రెస్‌కు షాక్
- జన బలం లేక కిరాయికి

హాలియా, అక్టోబర్ 20 : తిరుమలగిరి సాగర్ మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన కాంగ్రెస్ సభ జనంలేక వెలవెలబోయింది. జానారెడ్డి ప్రసంగం ప్రారంభంకాగా ఖాళీ కుర్చీలను చూసి ఖంగుతిన్నారు. స్థానికంగా జన బలం లేక పోవడంతోఆ పార్టీ నాయకులు గ్రామాల్లో అద్దె కూలీలను తీసుకొచ్చారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను కాంగ్రెస్‌లో చేర్చుకునేందుకు తిరుమలగిరి సాగర్‌లో కాంగ్రెస్ నాయకులు భారీ సభను ఏర్పాటు చేశారు. చుట్టుపక్కల మండలాలు, తండాలు, గ్రామాల నుంచి డబ్బులు ఇచ్చి జనాన్ని పోగు చేశారు. డబ్బులు తీసుకొని సభకు హాజరైన జనం, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కుందూరు జయవీర్‌రెడ్డి ప్రసంగిస్తుండగా ఒక్కొక్కరుగా లేచి వెళ్లిపోయారు.

## వ్యక్తిపై కేసు

నిడమనూరు, అక్టోబర్ 20 : కుటుంబ సభ్యులపై విచక్షణ రహితంగా దాడి చేసి గాయపరిచిన వ్యక్తిపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. విజయపురి టౌన్ ఎస్ఐ సంపత్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. నందికొండ హిల్‌కాలనీకి చెందిన యాదగిరి తన తండ్రి శ్రీరాములు, తల్లి భీమమ్మ, అక్క పద్మపై విచక్షణ రహితంగా దాడి చేసి గాయపరిచాడు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## వేంకటేశ్వరస్వామి ఆలయంలో చండీయాగం

హాలియా, అక్టోబర్ 20 : దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయంలో చండీయాగం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో 2వ వార్డు కౌన్సిలర్ యడవల్లి అనుపమ యుగేందర్‌రెడ్డి, మేడ వెంకట్రాంరెడ్డి, పేరూరి గోవింద్, ఆలయ అర్చకుడు రాఘవాచార్యులు పాల్గొన్నారు.

## చందుపట్ల ఎస్సీ హాస్టల్‌లో చోరీ

చివ్వెంల, అక్టోబర్ 20 : మండలంలోని బండమీది చందుపట్లలో గల ఎస్సీ బాలుర వసతి గృహంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. ఎస్‌ఐ మధు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఉదయం వర్కర్ వెంకటేశ్వర్లు హాస్టల్ వద్దకు వెళ్లగా హాస్టల్ గది తలుపులు పగులగొట్టి ఉండడంతో వార్డెన్ ఉప్పలయ్యకు సమాచారం అందించారు. రెండు కంప్యూటర్ మానిటర్లు, రెండు ఫ్యాన్లు, సోలార్ సిస్టం బ్యాటరీలు 14 చోరీకి గురైనట్లు వార్డెన్ వెల్లడించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## సరస్వతి దేవిగా సంతోషిమాత

బొడ్రాయిబజార్, అక్టోబర్ 20 : జిల్లా కేంద్రంలోని సంతోషిమాత ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం అమ్మవారు సరస్వతిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మున్సిపల్ కమిషనర్ పి.రామానుజులరెడ్డి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. పట్టణంలోని శ్రీరామ్‌నగర్ దుర్గామాత సెంటర్‌లో ఏర్పాటు చేసిన మండపంలో 50 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. వంద మహిళలకు సామూహిక కుంకుమార్చన చేశారు. కార్యక్రమాల్లో సంతోషిమాత దేవాలయ అధ్యక్ష, కార్యదర్శులు నూక వెంకటేశంగుప్తా, బ్రాహ్మండ్లపల్లి మురళీధర్, కొత్త మల్లికార్జున్, పబ్బా ప్రకాశ్, పాలరవపు రామ్మూర్తి, తాళ్లపల్లి రామయ్య, బ్రాహ్మణపల్లి బ్రహ్మయ్య, గోపారపు రాజు, మున్సిపల్ అధికారులు ప్రసాద్, సుమన్ పాల్గొన్నారు.



అర్వపల్లిలో సరస్వతి దేవీ అలంకారంలో దుర్గమ్మ